క్లుప్తంగా

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

తొట్టంబేడు: మండలంలోని ఎల్ఐసీ కాలనీ, రౌతు సూరమాల, శివనాథపాళెం తదితర గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. తొట్టంబేడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భారతికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు శివకుమార్, శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో ఇళ్ల స్థలాలు లేని పేదలు పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నారని తెలిపారు. కొంతమంది అప్పు చేసి, ఇల్లు కట్టుకుని 20 ఏళ్లు కావస్తున్న వారికి పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, పట్టాలు, పక్కా గృహాలకు రూ.ఐదు లక్షల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్బమ్మ, పరశురామయ్య, ధనలక్ష్మి, వెంకటమ్మ, అమరావతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బొజ్జల రిషితా రెడ్డి

రేణిగుంట: మండలంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారి అభ్యర్థనను మన్నించి ముఖ్యమంత్రి చంద్రబాబు 14 మంది లబ్ధిదారులకు రూ.14,83,943 మంజూరు చేశారు. మండలంలో సోమవారం బొజ్జల రిషితా రెడ్డి పర్యటించి, లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సుబ్రహ్మణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, మునస్వామి నాయుడు, పుష్ప నాథన్, తదితరులు పాల్గొన్నారు.

33 మంది ఉపాధ్యాయుల చేరిక

సత్యవేడు: మండలంలో 33 మంది ఉపాధ్యాయులు కొత్తగా విధుల్లో చేరినట్లు ఎంఈఓ కేరవి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు ఎంఈఓ నియామక పత్రాలు అందజేశారు. స్కూల్ అసిస్టెంట్లు 10 మంది, 23 మంది ఎస్జీటీలు చేరారని ఆయన తెలిపారు.

పరిశోధనల్లో ప్రగతి సాధిద్దాం

- ఫిజిక్స్ అధ్యాపకులతో ఎస్వీయూ వీసీ

తిరుపతి సిటీ: పరిశోధనల్లో ప్రగతి సాధించాలని ఎస్వీయూ వీసీ నరసింగరావు కోరారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన వీసీని ఫిజిక్స్ అధ్యాపక బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించింది. అనంతరం వీసీ వారితో మాట్లాడారు. ఫిజిక్స్ విభాగం పరిశోధనల్లో ప్రగతిని సాధించేందుకు అన్ని విధాల సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు, హుస్సేన్, పద్మావతి, రాజగోపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ మాజీ వీసీకి ఘన సన్మానం

తిరుపతి సిటీ: 15 నెలలపాటు ఇన్‌చార్జ్ వీసీగా సేవలందించిన ఆచార్య అప్పారావును నూతన వీసీ ఆచార్య నర్సింగరావు సోమవారం తన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. మున్ముందు అప్పారావు సేవలు, అనుభవాలను తాను ఉపయోగించుకుంటానన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి సర్కారుకు కళ్లు కనిపించలేదా?

- వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

నాగలాపురం: కల్తీ మద్యంతో పేదల ప్రాణాలు పోతున్నా కూటమి ప్రభుత్వానికి కళ్లు కనిపించలేదా? అని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు సోమవారం సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురంలో ప్రజలతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సమన్వయకర్త నూకతోటి రాజేష్ ప్లకార్డులు చేతపట్టి కల్తీ మద్యాన్ని నిర్మూలించాలని నినాదాలు చేపట్టారు. అనంతరం ఎక్సైజు ఎస్ఐ బాబుకు నూకతోటి రాజేష్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల్లో కూటమి ప్రభుత్వమే కల్తీ మద్యం అమ్మిస్తూ పేద ప్రజల ప్రాణాలను బలికొంటుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో సాధించిందేమిటంటే కల్తీ మద్యం తయారీ కోసం కుటీర పరిశ్రమల ఏర్పాటేనని చెప్పారు. ఈ విషయం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కు తెలిసినా తెలియనట్లు నటిస్తున్నారన్నారు. కల్తీ మద్యం అమ్మకాలతో కూటమి నేతలు రూ.వేల కోట్లు దోచుకుంటుండగా పేద ప్రజలు ప్రాణాలను కోల్పోతుంటున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ విషయమై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ఇక్కడ నుంచి కూటమి ప్రభుత్వం అంతం కావడానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి బెల్టుషాపులను 100 శాతం నిర్మూలిస్తే నేడు చంద్రబాబు కూటమి ప్రభుత్వంతో ఇంటి వద్దకే మద్యం విక్రయాలు చేపడుతూ విచ్చలవిడిగా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇలాంటి దుర్మార్గమైన పాలన ఏ రాష్ట్రంలో లేదని దీన్ని ప్రజలు గుర్తించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, ఉమ్మడి జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, పల్లికొండేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, బుజ్జిరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నేత జేబీఆర్ మునిరత్నం , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కేవీ భాస్కర్ నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు అపరంజిరాజు, దయాకర్ రెడ్డి, మనినాయుడు, గవర్ల కృష్ణయ్య, సారకాయలు, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు మస్తానమ్మ, సీనియర్ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, చిన్నదొరై, శ్యామ్, జగదీష్ రెడ్డి, మహేష్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, వజ్రవేలు, మోహన్ మొదలియార్, కులశేఖర్ రెడ్డి, రాజ, దేశప్పన్, చిరంజీవి, ఉదయ్ కుమార్, హరిబాబు పాల్గొన్నారు.



నాగలాపురం ఎక్సైజ్ ఎస్ఐ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

నిరసనకు భారీగా తరలిన నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: కల్తీ నకిలీ మద్యంపై నాగలాపురంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అధ్యక్షతన సోమవారం జరిగిన నిరసన కార్యక్రమానికి పార్టీ మండల కన్వీనర్ కొణతనేనిమణినాయుడు ఆధ్వర్యంలో మండల నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మణినాయుడు మాట్లాడుతూ నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరిస్తూ కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమలా అక్రమంగా తయారు చేస్తూ సరఫరా చేస్తుందన్నారు. నకిలీ మద్యంతోపాటు అక్రమ బెల్టు దుకాణాలతో గ్రామాల్లో గొడవలు సృష్టిస్తున్నారన్నారు.

శ్రీకాళహస్తిలో ర్యాలీ

శ్రీకాళహస్తి: నారా వారి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ ఎత్తున నిరసన తెలిపారు. ముందుగా వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి పట్టణశాఖ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభించి, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేసి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ వారికి వినతిపత్రం అందజేశారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ కల్తీ మద్యం తాగి ఇప్పటికే ఎంతోమంది అమాయకులు చనిపోయారన్నారు. తాళిబొట్లు తెగిపోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కల్తీ లిక్కర్ వ్యవహారాన్ని ఏ మాత్రం ఉపేక్షించకూడదని తెలిపారు. తూతూమంత్రంగా కమిటీలు వేసి, నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బాధితుల కుటుంబాలకు న్యాయం జరగాలంటే సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తిలోని బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యరాణి, పార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిలి సుబ్రహ్మణ్యం, రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, కోవి చంద్రయ్య నాయుడు, రేణిగుంట సర్పంచ్ నగేష్, పార్టీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మున్నా రాయల్, యువజన విభాగం మండల అధ్యక్షుడు సురావారి సురేష్ ,గోర, ఉత్తరాజి శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, బుల్లెట్ జయ శ్యామ్ రాయల్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పటాన్ ఫరీద్, డాక్టర్ వింగ్ ప్రెసిడెంట్ శంకర్, యువజన విభాగం టౌన్ ప్రెసిడెంట్ ముని కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పసల కృష్ణయ్య, ఫజల్, నారాయణ, శివ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశస్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి తదితర ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

యూరియా కొరత నివారించండి



వినతిపత్రం ఇస్తున్న తలపా దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రానున్న రబీ సీజన్‌లో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డిని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా అందక పొరుగు రాష్ట్రమైన తమిళనాడు(పళ్లిపట్టు) నుంచి యూరియా కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులకు పెట్టుబడులు అధికం అవుతున్నాయన్నారు. రాబోవు రబ్బీ సీజన్ దృష్ట్యా రైతులకు యూరియా కొరతను నివారిస్తూ రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా



ఖాళీగా ఉన్న ఎపీఓ కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌కు తహసీల్దార్, ఏఎంసీ కార్యదర్శి, ఉపాధి హామీ ఎపీఓలు డుమ్మా కొట్టారు. దీంతో వారి కార్యాలయాల్లోని కుర్చీలు ఖాళీగా దర్శమిచ్చాయి. వీరి కోసం వచ్చిన ప్రజలు పడిగాపులు కాశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేసే కార్యదర్శి, సూపర్‌వైజర్ విధులకు ఎపుడు వస్తారో తెలియక కార్యాలయం చుట్టు కాళ్లు అరిగేలా తిరుగుతున్నామని రైతులు వాపోతున్నారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే వీఆర్వోలు, సర్వేయర్లు హాజరుకాకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు వేచి చూచీ వెనుదిగారు. ఉపాధి కార్యాలయంలో పని చేసే సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని కూలీలు అంటున్నారు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రీవెన్స్ వీధులకు మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు సక్రమంగా హాజరు అయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైతులకు యూరియా పంపిణీ చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: రైతులకు అవసరమైనంత యూరియా పంపిణీ చేస్తామని డీఏఓ ప్రసాదరావు తెలిపారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి ఈ నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో ×ఆంక్షల యూరియా పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ స్పందించింది. ఆ మేరకు డీఏఓ ప్రసాదరావు సోమవారం సాయంత్రం వరదయ్యపాళెం మండలంలో యూరియా పంపిణీ చేస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ మేరకు కదూరు సహకార కేంద్రం ద్వారా పంపిణీ చేసేందుకు గోడౌన్‌లో నిల్వ చేసిన స్టాకును పరిశీలించారు. అనంతరం రైతులకు ఆయన చేతుల మీదుగా యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరదయ్యపాళెంలోని పలు ప్రైవేట్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత రానివ్వబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు అవసరమైన యూరియాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రైతులు సహకరించి అధికారుల సూచనలు పాటించి, యూరియా అందుకోవాలన్నారు. అవసరం మేరకు రైతులకు ఒకే విడతలో యూరియాను అందిస్తామన్నారు. వరదయ్యపాళెం మండలంలో సైతం 12 వేల ఎకరాలకు అవసరమైన యూరియాను సరఫరా చేస్తామన్నారు. అందుకు సంబంధించి అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు ఇండెంట్లను సిద్ధం చేయాలని సూచించారు. ప్రైవేటు డీలర్లు సైతం ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది కొరత సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏడీఏలు ధనంజయరెడ్డి, సుబ్రమణ్యం, ఏఓ గౌరి, కదూరు సహకార సంఘం చైర్మన్ అణిముత్యం నందకిషోర్ రెడ్డి ఉన్నారు.



యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మునికృష్ణారెడ్డిని సత్కరిస్తున్న బర్రె హేమభూషణరెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి యువత కృషి చేయాలని ఆ పార్టీశ్రీకాళహస్తి మండల మాజీ అధ్యక్షులు బర్రె హేమభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. యువకులు ఉత్సాహవంతులు పెద్దలంటే అపారమైన గౌరవంతో నడుచుకునే వ్యక్తి భగవద్గీత మహాగ్రంథాన్ని ప్రమాణంగా తీసుకుని ముందుకు వెళుతున్న మల్లెంబాకం మునికష్ణారెడ్డిని యువత అధ్యక్షుడిగా నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు మునికృష్ణారెడ్డిని సంత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా హేమభూషణరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి బాటలో చేపట్టబోయే ప్రజా ఉద్యమ కార్యక్రమంలో యువత చురుగ్గా పాల్గొనాలని కోరారు. వైఎస్సార్ సీపీ చేపట్టబోయే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలరామయ్య, సుధాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలో నూతన ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణానికి సోమవారం ఉదయం భూమి పూజ చేశారు. శ్రీ తులసి ఆయుర్వేద ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.శివప్రసాద్ ఆధ్వర్యంలో లాంఛనంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ హాజరయ్యారు. మొదటి దశలో రూ.75 లక్షల పెట్టుబడితో 10 పడకలు, ప్రత్యేక అవుట్ పేషెంట్ సేవలతో వచ్చే ఉగాది నాటికి ఈ ఆస్పత్రి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని డాక్టర్ శివప్రసాద్ తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చడమే కాకుండా, జాతీయ లక్ష్యమైన 'స్వస్థ భారత్' చొరవను ఇది ముందుకు తీసుకువెళుతుందని పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిలో పంచకర్మ, ప్రసూతి తంత్ర (ప్రసూతి - స్త్రీసంబంధిత వ్యాధులు), కాయచికిత్స (సాధారణ వైద్యం) ప్రత్యేక విభాగాలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో అవసరాల ఆధారంగా డయాగ్నస్టిక్ ల్యాబ్, పంచకర్మ - క్షారసూత్ర చికిత్స, యోగా, వెల్‌నెస్ సౌకర్యాలు, సంతానోత్పత్తి, రుమటాలజీ, లైఫ్‌స్టైల్ సంబంధిత వ్యాధులు, చర్మ - సౌందర్య చికిత్సల విభాగాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిరీషా మాట్లాడుతూ, సాంప్రదాయ ఆయుర్వేద జ్ఞానాన్ని ఆధునిక వైద్య విధానాలతో సమన్వయం చేస్తూ శ్రీ తులసి ఆయుర్వేద ఆస్పత్రి శ్రీసిటీలో సమగ్ర ఆరోగ్య కేంద్రంగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. శ్రీసిటీ సహజ సిద్ధ అనువైన వాతావరణం దీనికి అత్యంత అనుకూలంగా ఉంటుందని చెప్పారు.



శ్రీసిటీలో శ్రీ తులసి ఆయుర్వేద ఆస్పత్రికి భూమి పూజ చేస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

ఔషధ మొక్కల పెంపకంతో ఉపాధి

తిరుపతి సిటీ : ఔషధ మొక్కల పెంపకంతో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఔషధ మొక్కలు- ఉపాధి అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కాలేజీ ఆవరణలో హెర్బల్ నర్సరీ ఏర్పాటుకు రూ. 6.25 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరావు, బోటనీ విభాగాధిపతి ఏ.సురేఖ, పూర్వ అధిపతి డాక్టర్ ఎం.నాగరాజు, ఫ్యాకల్టీలు డాక్టర్ ఎం. సుధాకర్, డాక్టర్ కె. సుజాత, ఆయుర్వేద కళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పవన్ కుమార్, శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. సాయి వెంకటేష్ పాల్గొన్నారు.

హెచ్చరిక.. కబ్జాదారులకో లెక్కా!

- ముందు హెచ్చరిక బోర్డులు.. వెనుక ఆక్రమణలు
- వీకేఆర్‌వై కాలనీలో ఆగని ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



ఆక్రమణకు గురైన స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్ఓ, సిబ్బంది (ఫైల్)



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ప్రాంతంలో తాజాగా మట్టిని నింపి చదును చేసుకున్న అక్రమార్కులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌వై కాలనీలో అక్రమార్కులకు ప్రభుత్వ భూములు అడ్డాగా మారుతున్నాయి. ఆక్రమణల నియంత్రణకు రెవెన్యూ అధికారులు నామమాత్రపు చర్యలు తప్ప శాశ్వత చర్యల వైపు అడుగులు వేయడం లేదు. ఆ దిశగా ఆక్రమణలు జరిగిన చోట తూతూ మంత్రంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ఆపై అక్రమార్కులకు వంత పాడడం పరిపాటైంది. ఆ దిశగా వీకేఆర్‌వైకాలనీ కూడలిలోని బస్ షెల్టర్ సమీపంలోని స్థలాన్ని ఇటీవల కొందరు రాత్రికి రాత్రే ఆక్రమించుకున్నారు. ఈ ఘటన బహిర్గతం కావడంతో మరుసటి రోజు స్థానిక వీఆర్వో, సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే తాజాగా ఆదివారం రాత్రి అదే భూమిలో గ్రావెల్ మట్టిని ట్రాక్టర్లతో తోలి సోమవారం తెల్లవారే సరికి చదును చేయడం గమనార్హం. అంతేకాక ఆ ప్రాంతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును సైతం కనుమరుగు చేయడం అక్రమార్కుల అడ్డాకు పరాకాష్టగా మారింది. ఆ దిశగా ఆ ప్రాంతంలో తరచూ ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతేకాక సమీపంలోని సత్యవేడు ప్రధాన రోడ్డు ఆనుకుని అటు తూర్పు, ఇటు పడమట ప్రాంతంలోని శోత్రియ భూముల్లో వందలాది ఎకరాలు దుక్కి దున్ని రాత్రికిరాత్రే ఆక్రమించుకున్నారు. పట్టపగలే దున్నకాలు జరుగుతున్నా అక్కడే కాపలాగా ఉన్న వీఆర్ఏలు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆ భూముల్లో మరికొద్ది రోజుల్లో పంటను కూడా సాగు చేసేందుకు ఆక్రమణదారులు సిద్ధమవుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ ఉన్నతాధికారులు దృష్టికి ఈ ఆక్రమణల విషయాలను తెలియనీకుండా క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులతో కుమ్మక్కవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమార్కులపై కొరడా ఝుళిపించాల్సి ఉంది.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు





విరాళం అందజేస్తున్న విజయకుమార్, సాహితి



పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు వేర్వేరుగా విరాళాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన విజయకుమార్ దంపతులు తమ కుమార్తె బ్రాహ్మణి గౌడ పేరున రూ.లక్ష, నెల్లూరుకు చెందిన సాహితి రూ.55,555, నరసారావుపేటకు చెందిన పొన్నపాటి ఈశ్వరరెడ్డి రూ.11,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయాధికారులు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.